

యువతిపై అత్యాచారయత్నానికి

పాల్పడ్డ వ్యక్తికి

ఏడేళ్లు కఠిన కారాగార శిక్ష

- వివరాలు 7లో



సమావేశంలో పాల్గొన్న అధికారులనుద్దేశించి మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

చెత్తాచెదారాలతో ఉన్న బ్లాక్ స్పాట్‌లను గుర్తించాలి

అమలాపురం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో చెత్తాచెదారాలతో వున్న బ్లాక్ స్పాట్‌లను గుర్తించి శ్రమదానంతో పరిశుభ్రపరిచే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ పేర్కొన్నారు. స్వచ్ఛతా-హి-సేవా కార్యక్రమంలో భాగంగా ఈ నెల 14 నుంచి అక్టోబరు 2 వరకు నిర్వహించే సన్నద్ధత కార్యక్రమాలపై ఎంపీడీవోలు, పంచాయతీ అధికారులతో శుక్రవారం కలెక్టరేట్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. అన్ని వర్గాల ప్రజలను భాగస్వాములు చేయాలని ఆదేశించారు. బ్లాక్ స్పాట్ ప్రాంతాలను ఫొటోలు తీసి పరిశుభ్రత చేసిన తర్వాత యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. మొక్కలు నాటాలన్నారు. సఫాయి కర్మచారులకు సేఫ్టీ పరికరాలు అందించడంతో పాటు ఆరోగ్య సదస్సులు నిర్వహిస్తామన్నారు. 25 రకాల క్లీనింగ్ కార్యక్రమాలను 15 రోజుల పాటు నిర్వహిస్తామన్నారు. జిల్లాను అత్యంత పరిశుభ్రంగా నిలిపేందుకు ప్రజల భాగస్వామ్యంతో అధికారులు కృషి చేయాలన్నారు. స్వచ్ఛత కార్యక్రమానికి 15వ ఆర్థిక సంఘం, జనరల్ ఫండ్ నిధులను వినియోగించుకోవాలని సూచించారు. పక్షం రోజుల్లో ఏ గ్రామంలోనూ రహదారులకు ఇరువైపులా చెత్తకుప్పలు లేకుండా వాటన్నింటినీ చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రాలకు తరలించాలన్నారు. లేనిపక్షంలో సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా పంచాయతీ అధికారి డి.రాంబాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గత కొంత కాలంగా తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో మెడికల్ పింఛను పొందుతున్న అనర్హులపై కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ కొరడా ఝుళిపించారు. అనర్హులను నిర్ధారించి వారి పింఛన్లను నిలుపుదల చేయడం ద్వారా నెలకు రూ.30 లక్షలను ప్రభుత్వానికి ఆదా చేసిన ఘనత కలెక్టర్‌కు దక్కింది. తప్పుడు ధ్రువీకరణ పత్రాలు ఇచ్చిన మెడికల్ అధికారులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించడంతో ఇప్పుడు ఆ తప్పుడు ధ్రువీకరణలు ఇచ్చిన అధికారుల గుండెల్లో గుబులు రేకెత్తింది.



కొరడా ఝుళిపించిన కలెక్టర్

- తప్పుడు ధ్రువీకరణతో మెడికల్ పింఛను
- జిల్లాలో 668 మందిలో 281 మందిపై అనర్హత వేటు
- మెడికల్ బోర్డుల అధికారులపై విచారణకు ఆదేశం
- నెలకు రూ.30లక్షలు ఆదా చేసిన కలెక్టర్ మహేష్‌కుమార్
- పింఛన్లు పొందుతున్న అక్రమార్కుల్లో గుబులు

అమలాపురం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మెడికల్ పింఛను ద్వారా లబ్ధిదారునికి నెలకు రూ.15వేలను ప్రభుత్వం అందిస్తోంది. కోనసీమ జిల్లాలో 668 మంది లబ్ధిదారులు మెడికల్ పింఛను పొందుతున్నారు. అయితే వీరి పింఛన్ల వ్యవహారంలో వచ్చిన ఆరోపణలు, జిల్లా అధికారులకు అందిన ఫిర్యాదుల మేరకు వీటిపై కలెక్టర్ మహేష్‌కుమార్ దృష్టి సారించారు. క్షేత్రస్థాయిలో ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి నెల పాటు కూలంకషంగా విచారణ చేపట్టారు. దాంతో అధికారులు లబ్ధిదారుల ఇళ్లకు నేరుగా వెళ్లి వారికి ఉన్న అర్హతలపై ఆరా తీశారు. జిల్లాలో 668 మంది పింఛనుదారుల్లో 281 మంది మెడికల్ పింఛను పొందడానికి అనర్హులని, వీరంతా తప్పుడు సర్టిఫికెట్ల ఆధారంగా పెన్షన్ పొందుతున్నారని తేల్చేశారు. మరో 26 మంది అయితే ఎటువంటి పెన్షన్ పొందడానికి కూడా అర్హతలు లేవని కలెక్టర్‌కు నివేదించారు. అయితే వీరిలో పలువురు దివ్యాంగ పింఛన్లు పొందడానికి అర్హత కలిగి ఉన్నారని స్పష్టం చేశారు. దాంతో అనర్హులపై వేటు వేయడం ద్వారా నెలకు రూ.30 లక్షలు... అంటే ఏడాదికి రూ.3.60 కోట్లు ఆదా చేసిన ఘనత కలెక్టర్‌కు దక్కింది. దాంతో ఇప్పుడు మెడికల్ పింఛనుకు అర్హత కల్పించిన అధికారుల గుండెల్లో గుబులు రేగుతోంది. తప్పుడు ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేసిన రాజమహేంద్రవరం, అమలాపురం, రాజోలు, కాకినాడ పరిధిలోని మెడికల్ బోర్డుల అధికారులపై విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఇప్పటికే ఆదేశించారు. ఇందుకోసం డీఎంహెచ్‌వో, డీసీహెచ్ఎస్, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్లతో కమిటీని నియమించారు. తప్పుడు ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేసిన వైద్యాధికారులపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వివరించారు. కలెక్టర్ చర్యలతో ప్రభుత్వం నుంచి నెలనెలా వితంతు, ఒంటరి మహిళ, వృద్ధాప్య పింఛను వంటి వివిధ పెన్షన్లను తీసుకుంటున్న లబ్ధిదారుల్లోని అక్రమార్కుల్లో అప్పుడే వణుకు మొదలైంది. మెడికల్ పెన్షన్‌తో పాటు సాధారణ పెన్షన్‌లోనూ గత ప్రభుత్వంలో భారీగా అక్రమాలు జరిగిన నేపథ్యంలో కఠిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మూషిక వాహన మోదక హస్త...



అయినవిల్లిలో ఏడో రోజుకు గణపతి నవరాత్రి ఉత్సవాలు

అయినవిల్లి, సెప్టెంబరు 13: అయినవిల్లి శ్రీసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో గణపతి నవరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుని ప్రత్యేక అర్చనలు జరిపించుకుంటున్నారు. నవరాత్రి ఉత్సవాల్లో ఏడో రోజైన శుక్రవారం స్వామివారికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. శైవాగమోక్త ప్రకారం ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో దేవస్థానం ఆధ్వర్యంలో లక్ష దూర్వార్చన జరిగింది. మూషిక వాహనంపై స్వామివారికి మాడ వీధి సేవ జరిపారు. ప్రత్యేక అలంకరణ చేసి పంచ హారతులు ఇచ్చారు. మాగాంకు చెందిన వేటుకూరి మధురాజు చక్కెరపొంగలి, శ్రీవర సిద్ధివినాయక కమిటీ (దేవతిలకుల సంఘం) అయినవిల్లి వారిచే పులిహోర ప్రసాదం వితరణ చేశారు. ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు దంపతులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. దేవస్థానం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ సహాయ కమిషనరు, ఈవో ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా సిబ్బంది సేవలు అందించారు.



విఘ్నేశ్వర స్వామి దర్శనానికి వచ్చిన ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు దంపతులకు స్వాగతం పలుకుతున్న ఈవో సత్యనారాయణ, అర్చకులు

వైభవంగా పవిత్రోత్సవాలు



లక్ష్మీనరసింహ స్వామి,అమ్మవార్లకు అభిషేకం చేస్తున్న అర్చకుడు

అంతర్వేది, సెప్టెంబరు 13:అంతర్వేదిలో జరుగుతున్న పవిత్రోత్సవాల్లో భాగంగా రెండో రోజైన శుక్రవారం స్వామి-అమ్మవార్లను ప్రత్యేక సింహాసనంపై అధిష్ఠింపజేశారు. ఉదయం విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం జరిపారు. పురాతన కల్యాణ మండపం వద్ద ఉత్సవమూర్తులకు అర్చకులు పంచామృతాలతో, పంచ సూక్తాలతో వేద మంత్రోచ్ఛారణల నడుమ అభిషేకాలు నిర్వహించారు. విశేష పూజల అనంతరం అర్చకులు, ఆలయ చైర్మన్, అధికారులు స్వామివారికి వస్త్రాలు సమర్పించారు. కార్యక్రమంలో చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజాకలిదిండి కుమార రామగోపాల రాజ బహదూర్, ఆలయ సహాయ కమిషనరు వి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.





పి.గన్నవరం మండలం మానేపల్లి శివారు శివాయిలంకలో పడవపై వెళ్తున్న ప్రజలు

వీడిన వరద... వీడని ముంపు...

లంక గ్రామాలకు ప్రజలకు తప్పని ఇబ్బందులు... ఆదుకోవాలని ప్రభుత్వానికి వేడుకోలు

అమలాపురం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గోదావరి వరద తగ్గుముఖం పడుతోంది. అయినా సరే లంక గ్రామాలను ముంపు బెడద ఇంకా వీడలేదు. వివిధ గ్రామాల ప్రజలు ఇబ్బందిపడుతూనే ఉన్నారు. ప్రభుత్వపరంగా అధికార యంత్రాంగం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నప్పటికీ కోనసీమలోని గౌతమి, వశిష్ఠ, వైనతేయ, వృద్ధ గౌతమి నదీపాయల వెంబడి ఉన్న గ్రామాల ప్రజలు వరద కష్టాలను ఎదుర్కొంటున్నారు. నదీపాయలను ఆనుకుని ఉన్న కాజ్‌వేలు ముంపులోనే ఉన్నాయి. దాంతో ఆయా గ్రామాలకు రవాణా సౌకర్యాలు స్తంభించాయి. కోనసీమ జిల్లావ్యాప్తంగా నాలుగు మండలాల పరిధిలో పదకొండు గ్రామాలు వరద ప్రభావానికి గురైనట్టు అధికారులు గుర్తించారు. సుమారు 89 ఇళ్ల చుట్టూ వరద నీరు చేరింది. బాధితుల కోసం ఏడు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లో ఇప్పటివరకు 15 కుటుంబాలకు చెందిన బాధితులు తలదాచుకుంటున్నారు. వారికి ఆహారం, మంచినీటి సౌకర్యం కల్పిస్తున్నారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలకు చెందిన సుమారు 163 మంది సభ్యులు వరద ప్రభావిత లంక గ్రామాల ప్రజలకు సేవలు అందిస్తున్నారు. ముంపునకు గురైన ప్రాంతాల్లో స్థానిక ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు బాధితులను పరామర్శించి ఆహార పొట్లాలు, మంచినీరు అందిస్తున్నారు. నదీపరివాహక లంక గ్రామాల్లో ఆకు కూరగాయలు, పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ముఖ్యంగా వంగ, బెండ, బీర, మునగ, చిక్కుడు, టొమోటోవంటి పంటలు దెబ్బతినడంతో వాటిని సాగు చేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం తమ కుటుంబాలను ఆదుకోవాలని వేడుకుంటున్నారు. పశుగ్రాసం లేక పశువులు అల్లాడిపోతున్నాయి. ఏటిగట్ల వెంబడి పశువులకు ఆవాసం ఏర్పాటుచేసుకుని రైతులు వాటిని సంరక్షించుకునే పనిలో ఉన్నారు. నీరు స్వల్పంగా తగ్గుతుండడం వల్ల వరద ముంపునకు గురైన కాజ్‌వేలు, ఇతర రహదారులు ఇంకా బయట పడలేదు. ముంపు బారిన పడిన కుటుంబాలను ప్రభుత్వం గుర్తించి సహాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

పి.గన్నవరం: మండలంలోని మానేపల్లి శివారు శివాయిలంక గ్రామానికి వెళ్లే రహదారి పూర్తిగా నీట మునగడంతో కొబ్బరి తోటల్లోంచి పడవలపైనే రాకపోకలు సాగిస్తున్నారు. పల్లిపాలెం, చినకందాలపాలెం గ్రామాల్లో వీధులన్నీ జలమయం కావడంతో పాటు పలు ఇళ్లు ఇంకా ముంపు నుంచి తేరుకోలేదు. నాగుల్లంక శివారు పల్లిపాలెం, గుడ్డాయిలంక గ్రామాల్లో వరద కాస్త తగ్గినప్పటికీ ముంపు వీడలేదు. మొండెపులంక శివారు మల్లాయపాలెం, జొన్నల్లంక గ్రామాల్లో వరద శాంతించినప్పటికీ వీధులు నీటిలోనే ఉన్నాయి. కె.ఏనుగుపల్లి కాజ్‌వే వద్ద వరద ఉధృతి కాస్త తగ్గడంతో పడవలపై రాకపోకలు నిలిపివేశారు. స్థానికులు నీటిలోనే తిరుగుతున్నారు. గంటి పెదపూడి ఏటిగట్టు దిగువన కాజ్‌వే వరద ముంపు నుంచి కాస్త తేరుకుంది. దీంతో ఆ నాలుగు లంక గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించి బూరుగులంక నదీపాయ వద్దకు చేరుకుని అక్కడి నుంచి పడవలపై ప్రయాణాలు సాగిస్తున్నారు.

కె.ఏనుగుపల్లిలో కాజ్‌వే పైకి వరద నీరు చేరి పలు వీధుల్లోకి వచ్చింది. దీంతో స్థానిక పురోహితుడు పెద్దింటి కృష్ణమాచార్యులు బ్రహ్మత్వంలో టీడీపీ నాయకుడు గుడాల సంపదరావు-రామలక్ష్మి దంపతులు గురువారం రాత్రి ప్రత్యేక పూజలు చేసి గంగా హారతి ఇచ్చారు. గోదారమ్మా... శాంతించమ్మా అంటు స్థానికులు పూజల్లో పాల్గొన్నారు. వరద ముంపు ప్రాంతాల్లో అవసరమైనచోట బాధితులకు భోజనాలు పెడుతున్నామని కొత్తపేట ఆర్డీవో జీవీవీ సత్యనారాయణ తెలిపారు. మానేపల్లి శివారు శివాయిలంక, పల్లిపాలెం, చినకందాలపాలెంతో పాటు ఉడిమూడి సంచార జాతులు... మొత్తం 615 మందికి ఉదయం అల్పాహారం, భోజనాలు అందిస్తున్నామన్నారు. నదీపాయలు, రేవుల వద్ద ఎస్డీఆర్ఎఫ్ బృందాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఆర్డీవో వెంట తహసీల్దారు పి.శ్రీపల్లవి, సిబ్బంది ఉన్నారు.

పసుపు, పారాణి ఆరక ముందే...

హైదరాబాద్‌లో యువతి అనుమానాస్పద మృతి... మృతదేహంతో అమలాపురం రూరల్ ఎ.వేమవరంలో బంధువుల ఆందోళన



అమలాపురం రూరల్, సెప్టెంబరు 13: పెళ్లి జరిగి ఇంకా నెల కూడా కాలేదు. భర్తతో కలిసి హైదరాబాద్‌లో ఉన్న ఆ యువతి మృతి చెందడంపై ఆమె బంధువులు, కుటుంబ సభ్యులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పసుపు, పారాణి ఆరక ముందే... తొలి ఏడాది వరలక్ష్మీ వ్రతం కూడా చేసుకోకుండానే తమ కుమార్తెను పొట్టనపెట్టుకున్నారని మృతురాలి తల్లిదండ్రులు, బంధువులు ఆరోపిస్తున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి మండలం తొత్తరమూడి బాలయోగి కాలనీకి చెందిన రమ్యసత్యప్రియను అమలాపురం రూరల్ మండలం ఎ.వేమవరం నామాలవారిపాలేనికి చెందిన కొప్పిశెట్టి వెంకటసాయికి ఇచ్చి గత నెల 18వ తేదీన పెద్దల సమక్షంలో వివాహం జరిపించారు. 30వ తేదీన చివరి శుక్రవారం రోజున వరలక్ష్మీ వ్రతానికి తమ కుమార్తెను పంపాలని వెంకటసాయి కుటుంబ సభ్యులను కోరగా అప్పటికే సత్యప్రియను తీసుకుని హైదరాబాద్ వెళ్లిపోయాడు. సత్యప్రియ వారం పాటు ఫోన్‌లో మాట్లాడిందని, ఆ తర్వాత ఫోన్ కూడా అందుబాటులో లేకుండా చేశారని మృతురాలి సోదరుడు ఆరోపిస్తున్నాడు. ఈ నెల 10వ తేదీన సత్యప్రియ చనిపోయినట్టు భర్త వెంకటసాయి ఫోన్‌లో సమాచారం అందించడంతో ఆమె కుటుంబ సభ్యులు బయలుదేరి వెళ్లారు. మృతురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సైబరాబాద్ జిల్లా మోకిలా పోలీసుస్టేషన్‌లో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. గురువారం పోస్టుమార్టం నిర్వహించారు. సత్యప్రియ మృతదేహాన్ని ఆమె కుటుంబ సభ్యులు శుక్రవారం ఉదయం నేరుగా ఎ.వేమవరంలోని వెంకటసాయి ఇంటికి తీసుకువచ్చారు. మృతదేహంతో మధ్యాహ్నం వరకు ఆందోళన జరిపారు. కవలల్లో ఒకరైన సత్యప్రియ ఏ రోజునా అనారోగ్యం బారిన పడలేదని, కావాలనే తమ కుమార్తెను చంపేశారంటూ ఆందోళనకు దిగారు. అమలాపురం తాలూకా ఎస్ఐ వై.శేఖర్‌బాబు, అయినవిల్లి పోలీసులు సిబ్బందితో ఎ.వేమవరం చేరుకున్నారు. ఒకదశలో పరిస్థితి ఉద్రిక్తతకు దారితీసింది. మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలంటూ పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. చివరకు ఇరు గ్రామాల పెద్దలు చర్చల ద్వారా సమస్యను పరిష్కరించారు.



అమలాపురం రూరల్ ఎ.వేమవరంలో వెంకటసాయి ఇంటి వద్ద ఆందోళన చేస్తున్న మృతురాలి బంధువులు, (ఇన్‌సెట్‌లో) సత్యప్రియ పాతచిత్రం

'డాక్టర్ సీతానందం ఎక్సలెన్స్ ఇన్ బయోకంట్రోల్ రీసెర్చ్' అవార్డుకు చలపతిరావు ఎంపిక



అంబాజీపేట, సెప్టెంబరు 13: అంబాజీపేట డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధనా కేంద్రం అధిపతి డాక్టర్ ఎన్‌బీవీ చలపతిరావు 'డాక్టర్ సీతానందం ఎక్సలెన్స్ ఇన్ బయోకంట్రోల్ రీసెర్చ్' అవార్డుకు ఎంపికయ్యారు. బెంగళూరుకు చెందిన అసోషియేషన్ ఫర్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ పెస్ట్ మేనేజ్‌మెంట్ ఇన్ హార్టికల్చర్ ఇకో సిస్టమ్ ఐసీఏఆర్-ఐఐహెచ్ఆర్ కమిటీ ద్వారా ఈ ఎంపిక జరిగింది. డాక్టర్ జీఎస్ రంధ్వా ఆడిటోరియంలో ఈ నెల 25న జరిగే ఐసీపీపీహెచ్ ఇనాగ్యురల్ సెషన్‌లో ఈ అవార్డు అందజేస్తారు. చలపతిరావును శాస్త్రవేత్తలు, ఉద్యోగులు, సిబ్బంది అభినందించారు.



మంత్రి సుభాష్‌కు పలు అంశాలను వివరిస్తున్న దృశ్యం

ఆలయాలను అభివృద్ధి చేయండి

సమీక్షలో మంత్రి సుభాష్

రామచంద్రపురం (ద్రాక్షారామ), సెప్టెంబరు 13: జిల్లా దేవదాయ శాఖ పరిధిలోని ఆలయాల అభివృద్ధిపై కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ శుక్రవారం రామచంద్రపురంలో సమీక్షించారు. జిల్లా దేవదాయ శాఖ అధికారి ఎం.లక్ష్మీనారాయణ జిల్లాలోని దేవాలయాలు, ధార్మిక సంస్థలు, వాటి భూములు, ఆక్రమణలో ఉన్న భూములు, లీజుల గురించి వివరించారు. ప్రభుత్వం భూసేకరణలో సేకరించిన భూములు, రెమ్యునరేషన్ చెల్లింపు, నూతనంగా ఆక్రమణలో ఉన్న ఆలయాల ఆస్తుల స్వాధీనానికి చేసిన చట్టసవరణ తదితర అంశాలను విపులీకరించారు. జిల్లా వ్యాప్తంగా సీజీఎఫ్ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులు, టీటీడీ శ్రీవాణి ట్రస్టు చేపట్టిన ఆలయాల నిర్మాణ ప్రగతిని మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఆలయాలను అభివృద్ధి చేయ డంతో పాటు భక్తులకు వసతులు మెరుగుపరచాలని మంత్రి సూచించారు. సమావేశంలో రామచంద్రపురం డివిజన్ తనిఖీదారులు బాలాజీరామ్‌ప్రసాద్, అమలాపురం డివిజన్ తనిఖీదారు జె.రామలింగేశ్వరరావు, ఈవోలు వీర్రాజుచౌదరి, శ్రీదేవి, రామచంద్రపురం నియోజకవర్గ పరిధిలోని ఈవోలు, జిల్లా దేవదాయ శాఖ కార్యాలయ సిబ్బంది సతీష్, పలు ఆలయాల సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పాఠశాలలకు వర్కింగ్ డే

ముమ్మిడివరం, సెప్టెంబరు 13: జిల్లాలోని అన్ని పాఠశాలలకు ఈ నెల 14వ తేదీ రెండవ శనివారాన్ని వర్కింగ్ డేగా ప్రకటించినట్టు జిల్లా విద్యాశాఖాధికారి జి ఎం.కమలకుమారి తెలిపారు. జిల్లాలో గత మూడు నెలల్లో అధిక వర్షాల కారణంగా విద్యార్థుల రక్షణ దృష్ట్యా పాఠశాలలకు కాంపెన్సేటరీ సెలవులు ఇచ్చామని, వాటికి పరిహారంగా శనివారం జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల్లోని పాఠశాలలు కాంపెన్సేటరీ వర్కింగ్ డేగా పనిచేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు డీఈవో కార్యాలయం నుంచి డీవైఈవోలు, ఎంఈవోలు, పాఠశాలలకు, ప్రధానోపాధ్యాయులకు ఉత్తర్వులు అందాయి.

ప్రావీణ్యంతో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చు



సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యఅతిథి రామ్మోహన్‌రావు

రాజానగరం, సెప్టెంబరు 13 : జీవితంలో ఉన్నతంగా రాణించాలంటే విద్యలో ప్రావీణ్యం కనబర్చాలని ఏపీ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఇన్‌చార్జ్ చైర్మన్ ఆచార్య రామ్మోహన్‌రావు యువ ఇంజనీర్లకు సూచించారు. గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం(జీజీయూ)లో మేధ సాంకేతిక ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆచార్య రామ్మోహనరావు, ఛాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు)తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన రామ్మోహనరావు మాట్లాడుతూ ప్రస్తుతం విజ్ఞాన సముపార్జనకు పెద్దగా శ్రమించాల్సిన అవసరంలేదని, అవకాశాలకు కొదవలేదని అందు బాటులో ఉన్న అవకాశాలను సమర్థంగా వినియోగించుకుంటే సత్ఫలితాలు సాధించవచ్చన్నారు. యుక్త వయస్సులో సాధారణంగా వచ్చే భావోద్వేగాలను నియంత్రించుకోగలిగితే విజయం సాధించడం సుసాధ్యమవు తుందన్నారు. మానవతా విలువలను విస్మరించకుండా, జన్మనిచ్చిన తల్లిదండ్రులు తమ కోసం చేస్తున్న త్యాగాలను మరచిపోవద్దని కోరారు. భారతరత్నం సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని నేటి విద్యార్థులు ముందుకు సాగాలన్నారు. జీజీయూ ఛాన్సలర్ చైతన్యరాజు మాట్లాడుతూ భారతరత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా ఏటా మేధ సాంకేతిక ఉత్సవాలను రెండు దశాబ్దాలుగా తమ కళాశాలలో నిర్వహిస్తున్నామన్నారు. యువ ఇంజనీర్లలో అంతర్లీనంగా ఉన్న నైపుణ్యాలను వెలికి తీసి పదునుపెట్టేందుకు మేధ వంటి సాంకేతిక విద్య ఉత్సవాలు మంచి వేదికలుగా నిలుస్తాయన్నారు. జీజీయూ ఉపకులపతి యు.చంద్రశేఖర్ మాట్లాడుతూ సంస్కృతీసంప్రదాయాలను విలువలను పాటించడం ఎంతో అవసరమన్నారు. విద్యార్థులు ఇంటర్వ్యూలకు హాజరయ్యే సమయంలో వస్త్ర ధారణ విషయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. తొలుత జీజీయూ ప్రాంగణంలోని విశ్వేశ్వరయ్య విగ్రహానికి రామ్మోహనరావు, ఛాన్సలర్ చైతన్యరాజు, చంద్రశేఖర్ తదితరులు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు ఎం.శ్రీనివాసరావు, కేబీఆర్ వర్మ, రిజిస్ట్రార్ పీఎంఎంఎస్ శర్మ, ప్రిన్సిపాల్స్ టి.జయానంద కుమార్, ఎంవీఎస్‌బాబు, పి.జి.రామానుజం, మేధ కన్వీనర్లు బి.సుజాత, ఆర్.తమిళ్‌కోడి, వివిధ విభాగాల అధిపతులు తదితరులు పాల్గొన్నారు.

గోవిందా.. గోవిందా

నరేంద్రపురం నుంచి తిరుపతికి సైకిల్ యాత్ర
28 ఏళ్లుగా వేంకటేశ్వరస్వామి మాలధారణతో తిరుమలకు వెళ్తున్న భక్తులు


సైకిళ్లపై తిరుమలకు బయలుదేరిన యాత్రికులకు జెండా ఊపుతున్న బత్తుల వెంకటలక్ష్మి

రాజానగరం, సెప్టెంబరు 13 : మండలంలోని నరేంద్రపురం గ్రామానికి చెందిన వేంకటేశ్వరస్వామి భక్తులు శుక్రవారం సైకిల్ యాత్ర చేపట్టారు. 28 ఏళ్లుగా ఏటా క్రమం తప్పకుండా వారం దరూ వేంకటేశ్వరస్వామి మాల ధరించి, దీక్ష పూర్తిచేసుకుని సైకిల్‌పై తిరుమలకు వెళ్లి స్వామి వారిని దర్శించుకోవడం పరిపాటిగా మారింది. గ్రామానికి చెందిన ప్రగడ అంకాలు తన స్నేహితులతో కలిసి చేపడుతోన్న ఈ సైకిల్ యాత్ర 28 వసంతాలు పూర్తి చేసుకుంది. అంతేకాకుండా నరేంద్రపురంతో పాటుగా సీతానగరం, వెలుగుబంద, చెముడులంక గ్రామాల నుంచి 400 నుంచి 500 మంది భక్తులు ఏటా సెప్టెంబరులో సైకిల్ యాత్ర చేపట్టడం ఆనవాయితీగా వస్తోంది. వారం రోజుల పాటు సాగే యాత్ర తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనంతో దీక్ష ముగుస్తుందని భక్తులు చెప్పారు. ఈ కార్యక్రమాన్ని జనసేన పార్టీ నా సేన కోసం నావంతు కో ఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి దివాన్‌చెరువు వనువులమ్మ ఆలయం వద్ద ఘన స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల కన్వీనర్ వేగిశెట్టి రాజు, నాయకులు యర్రంశెట్టి శ్రీను, చిట్టిప్రోలు సత్తిబాబు, ప్రగడ నాగేశ్వరరావు, గట్టి రాంబాబు, ప్రగడ రాంబాబు, యర్రంశెట్టి తిరుమలేష్, తంగెళ్ల వీరబాబు, వంకా మల్లిబాబు, గంగిశెట్టి రాజేంద్ర తదితరులు పాల్గొని సైకిల్ యాత్ర సజావుగా సాగాలని ఆకాంక్షించారు.

జడ్పీ ఇన్‌చార్జి సీఈవోగా పాఠంశెట్టి బాధ్యతలు..


కలెక్టర్ షాన్‌మోహన్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న జడ్పీ సీఈవో నారాయణ మూర్తి

కాకినాడ సిటీ, సెప్టెంబరు 13: ఉమ్మడి తూర్పుగోదా వరి జిల్లా ప్రజాపరిషత్ ఇన్‌చార్జి ముఖ్యకార్యనిర్వహణాధికారిగా పాఠంశెట్టి నారాయణ మూర్తి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. కాకినాడ డివిజన్ డీఎల్‌డీవోగా విధులు నిర్వర్తిస్తున్న పాఠంశెట్టికి ఇన్‌చార్జి సీఈవోగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు కార్యాలయంలో సీఈవోగా బాధ్యతలు చేపట్టిన అనంతరం జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఇంతవరకు సీఈవోగా పని చేసిన ఎ.శ్రీరామచంద్రమూర్తి ఎన్నికల నిర్వహణ విధుల్లో భాగంగా కాకినాడ వచ్చారు. తిరిగి మాతృశాఖ రెవెన్యూలో జీఏడీ నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలందాయి. దీంతో సీఈవోగా ఆయన రిలీవ్ అయ్యారు.

తగ్గుతున్న గోదావరి ఉధృతి



ధవళేశ్వరం, సెప్టెంబరు 13 : రెండు రోజులుగా గోదావరి ఉధృతి క్రమంగా తగ్గుముఖం పడుతుంది. ధవళేశ్వరం వద్ద శుక్రవారం ఉదయానికి నీటిమట్టం 13.70అడుగులకు తగ్గడంతో రెండో ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు.ఆపై క్రమంగా తగ్గుతున్న నీటిమట్టం సాయంత్రం ఆరు గంటలకు 12.20 అడుగులకు చేరుకుంది. 10,46,957 క్యూసెక్కుల నీరు సముద్రంలోకి ప్రవహిస్తోంది. అర్ధరాత్రికి మొదటి ప్రమాదహెచ్చరికను ఉపసంహరించే స్థాయికి నీటి మట్టం తగ్గవచ్చు. ఎగువన భద్రాచలంవద్ద తగ్గుతున్న నీటి మట్టం శుక్రవారం సాయంత్రానికి 39.50 అడుగులుగా నమోదైంది.

విద్యార్థినులపై వేధింపులు

రాజమహేంద్రవరం రూరల్ సెప్టెంబరు 13: చిన్నారులకు విద్యాబోధనలు నేర్పించే ఉపాధ్యాయులే లైంగిక వేధింపులకు పాల్పడిన సంఘటన రాజమహేంద్రవరం రూరల్ మండలం శాటిలైట్ సిటీ ఏ బ్లాక్ మండల పరిషత్ పాఠశాలలో శుక్రవారం చోటు చేసుకుంది. పాఠశాలలో రెండో తరగతి ఉపాధ్యాయుడు సన్యాసిరావు ఐదో తరగతి విద్యార్థినులను శారీరకంగా వేధిస్తున్నాడంటూ తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న విద్యాశాఖ అధికారులు పాఠశాల వద్దకు చేరుకొని తల్లిదండ్రులతో మాట్లాడారు. ఉపాధ్యాయుడు తమ పిల్లలను శారీరకంగా వేధిస్తున్నాడని విద్యార్థినుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. సంఘటన స్థలానికి చేరుకున్న డీఎస్పీ భవ్య విద్యార్థినుల తల్లిదండ్రులతో పాటు పాఠశాల సిబ్బందిని విచారించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు సన్యాసిరావుపై బొమ్మూరు పోలీసులకు తల్లిండ్రులు ఫిర్యాదు చేశారు. రూరల్ ఎంఈఓ తులసీదాస్ మాట్లడుతూ ఈసంఘటనపై విచారణ అనంతరం నివేదికను జిల్లా విద్యాశాఖాధికారికి తగు చర్యల కోఽసం పంపుతామన్నారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం



సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 13: కాకినాడ రూరల్ బీచ్ రోడ్డు చౌదరి గెస్ట్ హౌస్ వెనకాల గల సముద్రతీరంలో 50 ఏళ్లలోపు గుర్తు తెలియని మహిళ మృతదేహం లభించినట్టు తిమ్మాపురం ఎస్‌ఐ ఎంవీవీ రవీంద్రబాబు తెలిపారు. మృతదేహంపై పచ్చరంగు జాకెట్టు ఎరుపు రంగు లంగా, మెడలో ఎరుపు రంగు తావీదు తాడు, తెలుపు, నలుపు రంగు జుట్టు కలిగి ఉందన్నారు. ఎడమ చేతికి ఆకుపచ్చ రంగు కలిగిన రెండు మట్టి గాజులు, కుడిచేతికి ఆకుపచ్చ, నీలం రంగు రెండు మట్టి గాజులు ఉన్నాయన్నారు. ఆచూకీ కోసం 0884-2306332, 9440796556 నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం పొందాలని కోరారు.

షోదార్పు యాత్ర..

- వరద బాధిత ప్రాంతాల్లో జగన్ మొక్కుబడి పర్యటన
- పేరుకే బాధితుల పరామర్శ.. ఎక్కడా బురదలో దిగని వైనం
- ముంపు గ్రామాల్లో పర్యటించకుండానే పైపై పలకరింపులతో సరి


నాగులాపల్లి వరద నీటిలో ట్రాక్టర్‌పై బాధితులను పరామర్శించేందుకు వెళుతున్న మాజీ సీఎం జగన్

కాకినాడ (ఆంధ్రజ్యోతి)/ పిఠాపురం, సెప్టెంబరు 13 : ఏలేరు వరద బాధిత ప్రాంతాల్లో శుక్రవారం మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికల ప్రచార తరహాలో పర్యటించడం విమర్శలకు దారితీసింది. వరద బాధితులకు ధైర్యం చెప్పడం మాటేమోగాని, ఎక్కడా వరద నీటిలోకి దిగకుండా, బాధితుల గోడు ఆలకించకుండా కేవలం నడిరోడ్డుపైనే వారిని నిలబెట్టి కారు ఎక్కి వెళ్లిపోయారు. దీంతో బాధితులు అవాక్కవ్వాల్సిన పరిస్థితి నెలకొంది.

జిల్లాలో ఏలేరు వరదలకు నాలుగు నియోజకవర్గాల్లో తొమ్మిది మండలాల్లో 64 గ్రామాలు కకావికలం అయ్యాయి. వేలాదిమంది బాధితులు తీవ్రంగా నష్టపోయారు. ఈ నేపథ్యంలో వీరిని ఇప్పటికే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, పీసీసీ అధ్యక్షురాలు షర్మిల పరామర్శించి ధైర్యం చెప్పారు. అయితే మాజీ సీఎం జగన్ శుక్రవారం ఏలేరు బాధిత ప్రాంతాల్లో పర్యటించారు. కానీ ఇది పరామర్శల తరహాలో కాకుండా ప్రచారంలా మారడం విశేషం. తొలుత ఉదయం 10.40 గంటలకు పిఠాపురం ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానంలో హెలీకాప్టర్‌లో దిగారు. అక్కడి నుంచి చేరుగా పిఠాపురం మండలం మాధాపురం వెళ్లారు. అక్కడ వరద బాధితులు జగన్‌ను చూసి ముంపునకు గురైన తమ గ్రామంలోకి వచ్చి తమ కష్టాలు తెలుసుకోవాలని కోరారు. కానీ జగన్ మాత్రం గ్రామంలోకి వెళ్లడానికి ఇష్టపడ లేదు. దీంతో వారంతా నీరసించారు. కాగా దారిలో చిన్నచిన్న గ్రామాలున్నా వాటిలో ఎక్కడ వరద ప్రభావం లేదు. కానీ జగన్ మాత్రం ప్రతి చోటా ఆగి. దారిపై ఉన్న వారందరినీ పలకరిస్తూ చేతులు ఊపారు. ముద్దులు పెడుతూ. తల నిమురుతూ ముందుకు సాగారు. దీంతో బాధితుల పర్యటన కంటే వరద ప్రభావం లేని ప్రాంతాల్లోనే జగన్ ఎక్కువ సేపు గడిపారు. ఆ తర్వాత పాత ఇసుకపల్లిలో ఆగి ప్రజలను పలకరించారు. ఆ తర్వాత జగన్ నాగులాపల్లి ముందు వంతెన కింద ఏలేరు వరదను పరిశీలించారు. ఆ తర్వాత నాగులాపల్లికి చేరుకున్నారు. కొందరు బాధితులు తమ గోడు వినాలని కోరగా, చేతికి ఉన్న వాచీ చూపించి సమయం లేదంటూ వెళ్లిపోయారు. అలాగే రమణక్కపేటకు మధ్యాహ్నం రెండున్నర దాటిన తర్వాత చేరుకున్న జగన్ అక్కడ రహదారిపై వరద ఎక్కువగా ఉందనే కారణంతో ట్రాక్టర్ ఎక్కి గ్రామంలో పరామర్శకు వెళ్లారు. తీరా అదే దారిలో పార్టీ నేతలు, కార్యకర్తలు నడుచుకుని వెళ్లారు. అక్కడ కూడా బాధితులతో మాట్లాడేందుకు పెద్దగా ఆసక్తి చూపని జగన్ వైసీపీ అధికారంలోకి లేకే ఇన్ని కష్టాలు వచ్చాయంటూ బాధితులకు చెప్పడం విశేషం. దీంతో వారంతా అవాక్కయ్యారు.

అందుకే అక్కడికి వెళ్లలేదు..

జగన్ గొల్లప్రోలు మండలంలో పర్యటించకపోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. గొల్లప్రోలు ఏలేరు వరదతో తీవ్రంగా అతలాకుతలమైంది. దీనికి ప్రధాన కారణం ఏలేరు ఆధునీకరణ జరగకపోవడమే. అయితే జగన్ 2022లో గొల్లప్రోలు వచ్చినప్పుడు ఏలేరు ఆధునీకరణకు నిధులు మంజూరు చేస్తానని చెప్పి చేయలేదు. దీంతో పనులు జరగలేదు. దీంతో ఇక్కడకు వస్తే జనం తిరగబడతారనే భయంతో జగన్ పెద్దగా వరద ప్రభావం లేని ప్రాంతాల్లో పర్యటించి మమ అనిపించారు. మరోపక్క జగన్ జిల్లాకు వచ్చినా మాజీ మంత్రులు వేణు, విశ్వరూప్ గైర్హాజరయ్యారు. పలువురు మాజీ ఎమ్మెల్యేలు కూడా ముఖం చాటేశారు. కాగా జగన్ పర్యటనలో పోలీసులు అతి చేయడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

వైసీపీ కార్యకర్తల అత్యుత్సాహం

కొత్తపల్లి, సెప్టెంబరు 13: ఏలేరు వరదల కారణంగా నీట ముంపునకు గురైన కొత్తపల్లి మండలంలో ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్మోహనరెడ్డి శుక్రవారం పర్యటించారు. జగన్‌కు బాణసంచాతో స్వాగతం పలికేందుకు నాగులాపల్లిలో వైసీపీ కార్యకర్తలు ఉర్రూతలూగారు. జగన్ ఇసుకపల్లి నుంచి నాగులాపల్లికి సమీపించేసరికి యువకులు ఒకటి రెండు తారాజువ్వలు పేల్చారు. ఇంతలో కొందరు మాజీ సీఎం వరద బాధితులను పరామర్శించేందుకు వస్తున్న తరుణంలో బాణసంచా కాల్చడం సరి కాదని చెప్పడంతో కాల్చడం విరమించారు. నాగులాపల్లి పాటి మీద నుంచి రమణక్కపేట వెళ్లేందుకు కాలువలో నీరు ఉధృతంగా ప్రవహించడంతో ట్రాక్టర్‌పై మాజీ సీఎం జగన్, మాజీ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్, వైసీపీ నాయకుడు వడిశెట్టి నారాయణరెడ్డి వెళ్లారు. వరద ముంపులో ఉన్న బాధితులకు నేటికీ ఎవరూ సాయం అందించలేదని పలువురు మహిళలు మాజీ సీఎంకు తెలిపారు. వరద బాధితులకు తక్షణం సాయం అందించే విధంగా కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని జగన్ బాధితులకు హామీ ఇచ్చారు.

డిజిటల్ మూల్యాంకన ప్రవేశపెట్టే దిశగా అడుగులు


ఉన్నత విద్యామండలి ఇన్‌ఛార్జి చైర్మన్ రామ్మోహనరావును నన్నయలో సన్మానిస్తున్న ఇన్‌ఛార్జి వీసీ

దివాన్‌చెరువు, సెప్టెంబరు 13 : డిజిటల్ మూల్యాంకన విధానాన్ని ప్రవేశపెట్టేదిశగా అడుగులు వేస్తున్నామని, పరీక్ష పత్రాల మూల్యాంకనం మరింత పారదర్శకంగా సాగుతుందని రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఇన్‌ఛార్జి చైర్మన్ ఆచార్య కె.రామ్మోహనరావు అన్నారు. ఆదికవినన్నయ విశ్వవిద్యాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఆయా కళాశాలలకు సంబంధించిన పలు విషయాలను అధికారులతో చర్చించారు. నాణ్యమైన ఉన్నతవిద్యను అందించేందుకు యాప్సీ లో వివిధ మార్పులు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. దానికి అనుగుణంగా విశ్వవిద్యాలయం పనిచేయాలని కోరారు. జాతీయ విద్యావిధానంలో భాగంగా అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్స్ ఐడీలను విద్యార్థులందరూ క్రియేట్ చేసుకోవాలని సూచించారు. తద్వారా సర్టిఫికెట్లను డిజిటల్ రూపంలో భద్రపరచుకుని, వాడుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈసందర్భంగా నన్నయ ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య వై. శ్రీనివాసరావు విశ్వవిద్యాలయంలో ఇటీవల జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. అనంతరం రామ్మోహనరావును శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ఆచార్య పి.సురేష్‌వర్మ, విశ్వవిద్యాలయ అధికార్లు పాల్గొన్నారు.

'మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ చట్టం ధ్రువపత్రం తప్పనిసరి'

రాజమహేంద్రవరం రూరల్ సెప్టెంబరు13: జిల్లాలోని ప్రైవేటు ఆసుపత్రులు సంతాన సాఫల్య కేంద్రాలు మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ చట్టం(ఎంటీపీ) ధ్రువపత్రాల అనుమతి తప్పనిసరిగా పొంది ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వెంకటేశ్వరరావు తెలిపారు. రూరల్ మండలం బొమ్మూరులోని వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఎంటీపీ యాక్ట్ పై శుక్రవారం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ చట్టం అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ప్రైవేటు ఆసుపత్రులు, సంతానసాఫల్య కేంద్రాలపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఎంటీపీ అనుమతులు పొందిన సంతాన సాఫల్యకేంద్రాలు నిర్వహిస్తున్న ఆసుపత్రులు విధిగా ప్రతినెలా నిర్దేశించిన ఫార్మేట్‌లో నివేదికలను అందజేయాలన సూచించారు. ఎంటీపీ అనుమతుల కోసం చేసుకున్న దరఖాస్తులను పరిశీలించామని, వాటికి సంబంధించి ఆయా ఆసుపత్రులలో సీనియర్ డివిజనల్ అధికారి ద్వారా స్థల పరిశీలన జరిపించి అనుమతులు మంజూరు తదితర అంశాలపై సమావేశంలో చర్చిస్తామని తెలిపారు. ఆ సమావేశంలో డిప్యూటీ డీఎంఅండ్ హెచ్ఓ డాక్టర్ సంధ్య, కమిటీ సభ్యులు గైనకాలజిస్టులు డాక్టర్ టి.పద్మజ, సీహెచ్ శైలజ, ఎన్జీవో జి.మానస, పంచాయతీరాజ్ సిబ్బంది పి.శశాంక తదితరులు పాల్గొన్నారు.

యువతిపై అత్యాచారయత్నం.. ఒకరికి ఏడేళ్ల జైలు

అమలాపురం రూరల్, సెప్టెంబరు 13: పద్దెనిమిదేళ్ల యువతిపై అత్యాచారయత్నానికి పాల్పడ్డ వ్యక్తికి ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ రాజమహేంద్రవరం 8వ అదనపు డిస్ట్రిక్ట్-సెషన్స్ కోర్టు కం స్పెషల్ కోర్టు జడ్జి వై.బెన్నయ్యనాయుడు శుక్రవారం తీర్పు చెప్పారు. అమలాపురం తాలూకా సీఐ పి.వీరబాబు కథనం ప్రకారం... అమలాపురం రూరల్ మండలం సాకుర్రు గ్రామానికి చెందిన పద్దెనిమిదేళ్ల యువతి ఇంటర్ చదువుకుని తాతయ్య వద్ద ఉంటోంది. గత ఏడాది ఫిబ్రవరి 7వ తేదీ మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఇంట్లో ఆ యువతి వద్దకు నేలపూడి వీర వెంకట సత్యనారాయణ అలియాస్ గుండు వచ్చి ఆమెను కోరిక తీర్చమని వేధించాడు. లేకపోతే యాసిడ్ పోస్తానని హెచ్చరించాడు. ఆమెపై అత్యాచారయత్నానికి ప్రయత్నించాడు. ఆ యువతి కేకలు వేయడంతో ఆమె అమ్మమ్మతో పాటు చుట్టుపక్కలవారు పరుగున వచ్చారు. యువతి ఫిర్యాదు మేరకు అమలాపురం తాలూకా పోలీసుస్టేషన్‌లో అప్పటి ఎస్ఐ ఎ.పరదేశి కేసు నమోదుచేసి ముద్దాయిని అరెస్టు చేసి రిమాండుకు పంపారు. పూర్తి సాక్ష్యాధారాలతో కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు.పబ్లిక్ ప్రాసిక్యూటర్ మారిశెట్టి వెంకటేశ్వరరావు ప్రాసిక్యూషన్ తరఫున వాదనలు వినిపించారు. వాదోపవాదాల అనంతరం సత్యనారాయణపై నేరం రుజువు కావడంతో ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.ఐదు వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి బెన్నయ్యనాయుడు తీర్పు చెప్పారు. ఈ కేసులో కృషి చేసిన అప్పటి ఎస్ఐ అందే పరదేశి, ఏఎస్ఐ ఆర్.గోపాలకృష్ణ, సీఐ పి.వీరబాబు, కోర్టు కానిస్టేబుల్ జి.సురేష్‌లను ఎస్పీ బి.కృష్ణారావు ప్రత్యేకంగా అభినందించారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

అమలాపురం టౌన్, సెప్టెంబరు 13: జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాలను అనుసరించి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని అన్ని కోర్టుల్లో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్టు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అమలాపురం, రాజమహేంద్రవరం, కాకినాడ, పెద్దాపురం, రామచంద్రపురం, పిఠాపురం, రాజోలు, ఆలమూరు, తుని, ముమ్మిడివరం, కొత్తపేట, ప్రత్తిపాడు, అనపర్తి, రంపచోడవరం, అడ్డతీగల కోర్టుల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తామన్నారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న సివిల్ తగాదాలు, యాక్సిండెంట్ కేసులు, బ్యాంకు కేసులు, రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు, ప్రీ లిటిగేషన్ కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవచ్చునన్నారు. కక్షిదారులంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సునీత కోరారు.

కోత, కుట్లు లేకుండా కిడ్నీలో రాళ్ల తొలగింపు

మెడికవర్‌లో 11 నెలల బాలుడికి అరుదైన వైద్యం

సామర్లకోట, సెప్టెంబరు 13: ఉభయగోదావరి జిల్లాలోనే తొలిసారిగా 11 నెలల బాలుడికి ఎటువంటి కుట్లు, కోత లేకుండా అత్యాధునిక ఆర్‌ఐఆర్‌ఎస్ ప్రక్రియ ద్వారా కిడ్నీలో రాళ్లను విజయవంతంగా తొలగించామని కాకినాడ జిల్లా సామర్లకోట ఏడీబీ రోడ్డులో ఉన్న మెడికోవర్ ఆసుపత్రి వైద్యబృందం శుక్రవారం వెల్లడించింది. కాకినాడ జిల్లాకు చెందిన ఒక బాలుడు కొన్ని నెలలుగా తీవ్ర జ్వరం, కడుపునొప్పితో బాధపడుతూ, మూత్రం పోయడంలో తీవ్ర ఇబ్బంది పడుతుండగా గమనించి తల్లిదండ్రులు పలు ఆసుపత్రులు తిప్పినా ఎటువంటి ఫలితం లేకపోవడంతో తమ మెడికవర్ ఆసుపత్రికి చివరగా వచ్చారని యూరాలజిస్ట్ డాక్టర్ కళ్యాణ్‌బాబు, డాక్టర్ మణికంఠ తెలిపారు. ఆ బాలుడికి అన్ని వైద్య పరీక్షలు నిర్వహించి కిడ్నీలో రాళ్లు ఉన్నట్లు నిర్ధారించి వెంటనే సర్జరీ చేసి వాటిని తొలగించాలని బాలుడి తల్లిదండ్రులకు చెప్పామన్నారు. అత్యాధునిక ఆర్‌ఐఆర్‌ఎస్(రెట్రో గ్రేడ్ ఇంట్రారెనల్ సర్జరీ) ప్రక్రియ ద్వారా బాలుడి కిడ్నీలో రాళ్లను తొలగించి బాలుడిని మూడు రోజుల్లో పూర్తి ఆరోగ్యంగా ఇంటికి పంపామన్నారు. పోషరాహార లోపం, అధిక ఉప్పు వినియోగం, మాంసాహారం ఎక్కువగా తీసుకోవడం వల్ల భారతదేశంలో కిడ్నీ స్టోన్ వ్యాధి సాధారణమైతే.. నవజాత శిశువులలో దీనిని కనుగొనడం అతి అరుదని చెప్పారు. ఆర్‌ఐఆర్‌ఎస్ అనేది ఎండోస్కోపిక్ శస్త్రచికిత్స అని ఇది మూత్ర నాళం నుంచి కిడ్నీ చేరుకోవడానికి అనుమతిస్తోందన్నారు. ఈ రకమైన విధానాలకు అనువైన యూరిటెరోస్కోప్ ఉపయోగించబడుతుందన్నారు. దీని తర్వాత చిన్న చిన్న రాళ్ల ముక్కలను కూడా పూర్తిగా తొలగించవచ్చన్నారు. ఈ ప్రక్రియలో ఎటువంటి కోతలు, కుట్లు ఉండవన్నారు. రక్తస్రావం కూడా ఉండదన్నారు. అనస్తీషియాలజిస్ట్ డాక్టర్ కిశోర్ మాట్లాడుతూ ఇది ఎంతో సంక్లిష్టమైన ప్రక్రియ అని 11 నెలల బాలుడు కారణంగా మత్తు ఇవ్వడంలో పలు జాగ్రత్తలు తీసుకోవడం జరిగిందన్నారు. మెడికవర్ ఆసుపత్రి సెంటర్ హెడ్ సుభాకరరావు మాట్లాడుతూ ఈ ప్రక్రియను విజయవంతంగా నిర్వహించడం ద్వారా బాలుడికి ఆరోగ్యవంతమైన జీవితాన్ని ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేశారు. తమ మెడికోవర్ ఆసుపత్రిలో అత్యాధునిక వైద్యచికిత్సలు విజయవంతంగా నిర్వహించేందుకు సాంకేతిక పరిజ్ఞానం మాత్రమే గాకుండా అనుభవజ్ఞులైన వైద్యనిపుణులు అందుబాటులో ఉన్నారని డాక్టర్ కళ్యాణ్‌బాబు అన్నారు.

రోడ్డు ఫెన్సింగ్‌ను ఢీకొన్న బైక్

దంపతులకు తీవ్రగాయాలు.. ఆసుపత్రికి తరలింపు

దేవరపల్లి, సెప్టెంబరు 13: దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి వద్ద బైక్ అదుపుతప్పి రోడ్డు పెన్సింగ్‌ను ఢీకొట్టడంతో భార్యాభర్తలకు తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల వివరాల ప్రకారం.. నల్లజర్ల మండల చీపురుగూడెం గ్రామానికి చెందిన వసంతాడ మధుబాబు భార్య సంగీత, ఏడాది వయసున్న కుమారుడితో గోపాలపురం అత్తవారి ఇంటి వద్ద నుంచి చీపురుగూడెం స్వగ్రామానికి శుక్రవారం మధ్యాహ్నం బైక్‌పై బయలుదేరారు. దేవరపల్లి సమీపంలో గ్రీన్‌ఫీల్డ్ హైవే రహదారి వద్ద అదుపు తప్పి రోడ్డు పక్కన పెన్సింగ్‌ను ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. హైవే సేఫ్టీ అంబులెన్స్‌లో వీరిని గోపాలపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ ప్రథమ చికిత్స చేసి రాజమహేంద్రవరంప్రైవేటు ఆసుపత్రికి తరలించారు

పోలవరం కాలువలో వ్యక్తి మృతదేహం

తుని రూరల్, సెప్టెంబరు 13: కాకినాడ జిల్లా తుని మండలం లోవ కొత్తూరుశివారు పోలవరం కాలువలో వ్యక్తి మృతదేహం కలకలం రేపింది. గట్టుమీద చెప్పులు, కాలువలో మృత దేహం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న రూరల్ పోలీసులు మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడు రౌతులపూడి మండలం రౌతులపూడి గ్రామానికి చెందిన జిగిరెడ్డి శ్రీనివాసరావు(42)గా తెలిపారు. సంబంధిత వ్యక్తి సివిల్ కేసు విషయమై తుని వచ్చి, పని ముగించుకుని, రౌతులపూడి ఇంటికి వెళ్లే క్రమంలో పోలవరం కాలువలో మృతదేహంగా కనిపించడంపై మృతుడి బంధువులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కేసు నమోదు చేసి పోలీసులు విచారణ చేపడుతున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

'క్రీడలతో మానసికోల్లాసం'


బ్యాడ్మింటన్ ఆడుతూ విద్యార్థులను ఉత్సాహ పరుస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

అన్నవరం, సెప్టంబరు 13: క్రీడల ద్వారా శారీరక ఆరోగ్యం, మానసిక ఉల్లాసంతో పాటుగా ప్రత్యేకగుర్తింపు లభిస్తాయని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పేర్కొన్నారు. శుక్రవారం అన్నవరం జూనియర్ కళాశాల మైదానంలో అంతర్‌జిల్లాల సబ్ జూనియర్ బాలబాలికల బ్యాడ్మింటన్ పోటీలను ఆమె ప్రారంభించారు. ఉమ్మడి తూర్పుగోదావరి బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో 13 ఉమ్మడి జిల్లాల అండర్-19 బాలబాలికలు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే బ్యాట్ చేతబట్టి కొద్దిసేపు బాల్‌బ్యాడ్మింటన్ ఆడి క్రీడాకారులను ఉత్తేజపరిచి తన చిన్ననాటి స్కూల్ గుర్తులను నెమరువేసుకున్నారు. అసోసియేషన్ చైర్మన్ ముప్పన వీర్రాజు మాట్లాడుతూ 13, 14, 15 తేదీలలో ఈపోటీలు నిర్వహించి వీరిలో ప్రతిభ కలిగిన వారిని రాష్ట్ర స్థాయి టీంగా ఎంపిక చేస్తామని, వీరు సెప్టంబరు 29 నుంచి 31 వరకు హర్యానాలో జరిగే జాతీయస్థాయి పోటీలలో ఆడతారన్నారు. తొలిరోజు పోటీలలో విశాఖ, తూర్పుగోదావరి, శ్రీకాకుళం, కర్నూలు, కడప, చిత్తూరు జిల్లాల టీంలు బాలుర విభాగంలో విజయం సాధించగా, బాలికల విభాగంలో తూర్పుగోదావరి, శ్రీకాకుళం, విశాఖ, గుంటూరు, ప్రకాశం జట్లు విజయం సాధించాయి. కార్యక్రమంలో టీడీపీ నేత యనమల రాజేష్ పాల్గొన్నారు. వీరభద్రస్వామి, సీతాపతిరావు, పాల్గొనగా పర్వత వీరేష్, కోళ్ల సూరిబాబు తదితరులు అంపైర్లగా వ్యవహరించారు.

సడన్.. సర్ప రైజ్..

మోతుగూడెం జెన్కో కాలనీలో కింగ్ కోబ్రా హల్‌చల్



మోతుగూడెం, సెప్టెంబరు13: మోతుగూడెం సెకండ్ రింగ్ రోడ్‌లో శుక్రవారం కింగ్ కోబ్రా హల్‌చల్ చేసింది. పదిరోజులుగా కురిసిన వర్షాలకు, వరదలకు ఎటునుంచి వచ్చిందో తెలియదు కానీ రెండో రింగ్ రోడ్డులో సుమారు 10 అడుగులున్న కింగ్ కోబ్రా కనిపించడంతో ఈ ప్రాంత వాసులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. ఈ మధ్యకాలంలో కింగ్ కోబ్రా హల్‌చల్ చేయడం రెండోసారి. దీంతో చిన్న పిల్లలను బయటకు వదలాలంటేనే తల్లిదండ్రులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఫారెస్ట్ అధికారులు స్పందించి కింగ్ కోబ్రాను పట్టుకుని దూరంగా అడవిలో వదిలేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. లేనిచో పై అధికారులకు ఫిర్యాదు చేస్తామని గ్రామస్తులు తెలుపుతున్నారు.

గంగవరంలో లక్ష్మీ గణపతి హోమం

కె.గంగవరం, సెప్టెంబరు 13: కె.గంగవరంలో రామాలయం వద్ద జరుగుతున్న గణపతి నవరాత్రుల్లో భాగంగా శుక్రవారం భక్తులు లక్ష్మిగణపతి హోమం, గరికపూజ నిర్వహించారు. వేదపండితులు సుదర్శనం దొర బాబు, ఏడునూతుల మురళీ శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా పూజలు చేశారు. పలువురు గ్రామస్తులు గణపతి హోమంలో పాల్గొని పూజలు చేశారు. గంగవరంలో రైల్వే కాలనీలో గణపతి నవరాత్రి ఉత్స వాల్లో భాగంగా శుక్రవారం సామూహిక కుంకుమ పూజలు చేశారు.

రాయవరంలో సౌభాగ్యలక్ష్మీ వ్రతం

రాయవరం, సెప్టెంబరు 13: రాయవరంలో శ్రీలక్ష్మీ గణపతి కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం సౌభాగ్యలక్ష్మి వ్రతం ఘనంగా నిర్వహించారు. అర్చకులు యలమంచిలి సత్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో వినాయకుడికి అభిషేకం, అర్చనలు, లక్ష్మీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలతో సౌభాగ్యలక్ష్మీ వ్రతం చేయించారు. వెదురుపాక సపోటా సెంటర్‌లో ఉన్న లక్ష్మీ గణపతి మండపం వద్ద వినాయకుడికి వివిధ రకాల ద్రవ్యాలతో అభిషేకం, లక్ష గరికపూజ, నీరాజన మంత్ర పుష్పాలు నిర్వహించారు. రాయవరంలో జరిగిన కార్యక్రమంలో కొవ్వూరి వెంకట రామారెడ్డి, కోనాల సుధాకర్‌రెడ్డి, వెలగల హేమ మణికంఠరెడ్డి, సబ్బెళ్ల త్రినాధరెడ్డి, జగదీశ్వరరెడ్డి, పీఎస్ఆర్, పులగం శ్రీనివాస రెడ్డి, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

నేడు కవిసంధ్య స్వర్ణోత్సవ సంచిక ఆవిష్కరణ

యానాం, సెప్టెంబరు13:యానాం కవిసంధ్య సాహితీ సాంస్కృతిక సంస్థనుంచి వెలువడుతున్న కవిసంధ్య ద్వైమాసిక పత్రిక స్వర్ణోత్సవ సంచిక ఆవిష్కరణ సభ శనివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్‌లో జరగనుంది. స్వర్ణోత్సవ సంచికను ఆంధ్రజ్యోతి సంపాదకులు డాక్టర్ కె.శ్రీనివాస్ ఆవిష్కరించనున్నట్టు కవిసంధ్య సంపాదకులు డాక్టర్ శిఖామణి తెలిపారు. సుప్రసిద్ధ కవి, సరస్వతి సమ్మాన్ పురస్కార గ్రహీత కె.శివారెడ్డి సభకు అధ్యక్షత వహించనున్నారు. నాగరాజు రామస్వామి రచించిన కవన కోకిలలు పుస్తకాన్ని శిఖామణి ఆవిష్కరిస్తారు.

వరద బాధితులకు రూ.50వేలు విరాళం



ఆత్రేయపురం, సెప్టెంబరు 13: విజయవాడ వరద బాధితుల కోసం అంకంపాలెం మాజీ సర్పంచ్ కరుటూరి నరసింహరావు కుమారుడు బాలసాయికృష్ణ రూ.50వేలు విరాళం అందించారు. శుక్రవారం అమరావతిలో సీఎం నారా చంద్రబాబునాయుడును కలిసి చెక్కును అందజేశారు.

ఎర్ర బ్యాడ్జీలతో నిరసన

అమలాపురం టౌన్, సెప్టెంబరు 13: కొత్తగూడెం వన్‌మెన్ సర్వీసును నిరసిస్తూ అమలాపురం ఆర్టీసీ డిపోలో అన్ని యూనియన్లతో కలిసి శుక్రవారం ఎర్ర బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఎండీ ఔలియా, పీవీ రమణ, ఎస్ఎస్‌వీ గణేష్, పీఎన్‌కేడీ రావు, టీఎస్ రావు, కోటేశ్వరరావు, పి.దొరబాబు పాల్గొన్నారు.

మైసూరు యాత్రకు ఆర్టీసీ ప్రత్యేక బస్సు

రావులపాలెం, సెప్టెంబరు 13: రావులపాలెం ఆర్టీసీ డిపో నుంచి మైసూరు యాత్రకు ప్రత్యేక బస్సు నడుపుతున్నట్టు డిపో మేనేజరు కేడీఎంఎస్ కుమార్ తెలిపారు. శ్రీశైలం, మహానంది, మంత్రాలయం, గోకర్ణం,మురడేశ్వర్, కొల్లూరి మూకాంబిక, ఉడిపి, శృంగేరి, హోర్నాడు, ధర్మస్థల, కుక్కేసుబ్రహ్మణ్యం, హాలిబేడు, బేలూరు, శ్రీరంగపట్నం, కోటిలింగాలు, మైసూరు, అరుణాచలం, శ్రీకాళహస్తి దర్శనాల అనంతరం రావులపాలెం చేరుకుంటుంది. అక్టోబరు 7నరావులపాలెం డిపో నుంచి బస్సు బయలుదేరి 8రోజుల యాత్ర తర్వాత 15నతిరిగి చేరుకుంటుందన్నారు. భోజన ఖర్చులతో ఒక టిక్కెట్టు ధర రూ.10,500గా నిర్ణయించామని, వివరాలకు 7382911871 నెంబరులో సంప్రదించాలన్నారు.

గణేష్ ప్రతిమల పోటీలు

కాట్రేనికోన, సెప్టెంబరు 13: చెయ్యేరు శ్రీశ్రీనివాసా ఇంజనీరింగు కళాశాలలో శుక్రవారం కరస్పాండెంట్ డీవీఎస్ఎస్ వర్మ గణేష్ ప్రతిమల పోటీలు ప్రారంభించారు. ఆధునిక సాంకేతిక మేళవింపులతో ప్రతిమల తయారీ విధానం ప్రశంసనీయమని ఆయన అన్నారు. ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసకుమార్, పాలకవర్గ సభ్యుడు సందీప్, ఎస్.జయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

దోమల నిర్మూలనకు చర్యలు

మామిడికుదురు, సెప్టెంబరు 13: దోమల నిర్మూలనకు నగరం గ్రామంలో శుక్రవారం ఆయిల్‌లో నానబెట్టిన బాల్స్‌ను నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో విడిచిపెట్టారు. మామిడికుదురు, పాశర్లపూడిలంకలో అంటువ్యాధులు ప్రబలకుండా పంచాయతీ శానిటేషన్ పనులు నిర్వహించింది. ఆయా కార్యక్రమాల్లో సర్పంచ్‌లు గౌస్ మొహిద్దీన్, తెలగారెడ్డి సూర్యప్రకాశరావు, హెల్త్ అసిస్టెంట్ ఎం.ఏడుకొండలు, ఏఎన్ఎంలు చంద్రకుమారి, సునీత, ఎంఎల్‌హెచ్‌పీ సునీత తదితరులు పాల్గొన్నారు.

తేరుకుంటున్న లంక గ్రామాలు

ముమ్మిడివరం, సెప్టెంబరు 13: వరద ప్రవాహ ఉధృతి తగ్గడంతో లంక గ్రామాలు ఇప్పుడిప్పుడే వరద ముంపు నుంచి బయట పడుతున్నాయి. దీంతో లంక గ్రామాల ప్రజలు, అధికారులు ఊపిరి పీల్చుకుంటున్నారు. మండలంలో వరద ముంపునకు గురైన లంక గ్రామాల్లో ప్రధాన రోడ్లు ముంపు నుంచి బయటపడినా ఇంటర్నల్ రోడ్లు ఇంకా ముంపులోనే ఉన్నాయి. వివేకానంద వారధి నుంచి గురజాపులంక సిమెంటు రోడ్డు వరద నీటి నుంచి కొంత వరకు బయట పడింది. గురజాపులంక తుపాను షెల్టర్ సమీపంలో ఇంకా కొంతమేర రోడ్డు పైనుంచి వరదనీరు ప్రవహిస్తుంది. దీంతో అక్కడ ప్రజలు పడవల్లో రాకపోకలు సాగిస్తున్నాయి. ఇంకా లోతట్టు ప్రాంతాల్లోని ఇంటర్నల్ రోడ్లు వరద ముంపులోనే ఉన్నాయి. వరద ముంపు బాధితులకు ఆర్‌డబ్ల్యుఎస్ ఆధ్వర్యంలో మంచినీటిని సరఫరా చేస్తున్నారు. వైద్య శిబిరాలు కొనసాగుతున్నాయి. తహశీల్దార్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూము కొనసాగుతుంది. వీఆర్వోలు స్థానికంగా ఉండి పరిస్థితిని సమీక్షిస్తున్నారు. తహశీల్దార్ సుబ్బలక్ష్మి వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి రెవెన్యూ పంచాయతీ కార్యదర్శులకు సూచనలిచ్చారు. వరద బాధితులకు సహాయ సహకారాలు అందించేందుకు వచ్చిన ఎన్డీఆర్ఎఫ్ 36మంది బృందం స్థానికంగా ఉండి సేవలు అందిస్తున్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజల రాకపోకలకు ఏర్పాటుచేసిన ఐదు మెకనైజ్డ్ బోట్లు, మరో ఐదు ఇంజను పడవల్లోప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు.



అంతర్వేది: అప్పనరామునిలంక-టేకిశెట్టిపాలెం వదర నీటిలో పడవలో ప్రయాణిస్తున్న ప్రయాణికులు

జల దిగ్బంధంలోనే లంక గ్రామాలు

మామిడికుదురు, సెప్టెంబరు13: గోదావరికి వరద స్వల్పంగా తగ్గుతున్నప్పటికీ లంక గ్రామాలు జలదిగ్బంధంలోనే ఉన్నాయి. అప్పనపల్లి కాజ్‌వేపై ఇంకా 4అడుగుల లోతు వరద నీరు ప్రవహిస్తుండడంతో రాకపోకలు పునరుద్ధరించలేదు. అప్పనపల్లి, బి.దొడ్డవరం, పెదపట్నంలంక గ్రామాల ప్రజలు అప్పనపల్లి ఉచ్చులవారిపేట మీదుగా రెండు అడుగుల వరద నీటిలో ప్రయాణాలు చేస్తూ బాహ్య ప్రపంచానికి వస్తున్నారు. ఆయా గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. అప్పనపల్లిలో నదీపాతం గృహాలను ముంచెత్తిందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వరద వచ్చినప్పుడల్లా విలువైన కొబ్బరి తోటలు నదీగర్భంలో కలిసిపోతున్నాయని అంటున్నారు. పెదపట్నంలోని రత్నాపురం, పాశర్లపూడిలో పల్లవపాలెం, శ్రీరాంపేటప్రాంతాలు ఇంకా జల దిగ్బంధంలోనే ఉన్నాయి.

తగ్గుముఖం పట్టిన వరద

అంతర్వేది, సెప్టెంబరు 13: అప్పనరామునిలంక, టేకిశెట్టిపాలెం గ్రామాల్లో వరద ప్రవాహానికి ప్రజలు పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. మండలాధికారులు, సచివాలయ సిబ్బంది వరద బాధితులకు కావాల్సిన ఆహార పొట్లాలు, తాగునీరు పంపిణీ చేస్తున్నారు. వరద స్వల్పంగా తగ్గడంతో లంక గ్రామాల నుంచి పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. వైద్య సిబ్బంది శిబిరాలు ఏర్పాటు చేశారు.

సీపీఎం పార్టీ సంతాపం

ముమ్మిడివరం, సెప్టెంబరు 13: సీపీఎం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారామ్ ఏచూరి మృతికి ముమ్మిడివరంలో సీపీఎం పార్టీ నాయకులు సంతాపం ప్రకటించారు. స్థానిక పార్టీ కార్యాలయం వద్ద శుక్రవారం సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జి.దుర్గాప్రసాద్, మండల కార్యదర్శి సకిలే సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఏచూరి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్.అజయ్‌కుమార్, దొమ్మేటి రాఘవులు, పాము బాలయ్య వి.వీర్రాజు పాల్గొన్నారు.

ఏఎన్ఎంల వినతి

మలికిపురం, సెప్టెంబరు 13: గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉన్న ఏఎన్ఎంలను మదర్ డిపార్టుమెంటులో కలపాలని, గ్రామ, వార్డు సచివాలయంలోనే ఉంచితే ఎంపీహెచ్ (ఎఫ్) క్రింద మార్చి జాబ్‌చార్టు తెలియజేయాలని, పదోన్నతిపై వివరణ ఇవ్వాలని కోరుతూ శుక్రవారం రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. కడలి బేబిపద్మకుమారి, పి.వరలక్ష్మి, ఇందిర, మంగ, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఆత్రేయపురం, సెప్టెంబరు13: లొల్ల బీసీపేట నుంచి ఏటిగట్టు మీదుగా వాడపల్లి వెళ్లే వాహనచోదకులకు ఇబ్బంది లేకుండా రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే బండారు సత్యానందరావు నిధులు మంజూరుచేశారు. పుంత, ఏటిగట్టును సీసీ రోడ్డుగా, నాలుగు ర్యాంపులను సీసీ రోడ్లుగా నిర్మించే రింగ్‌రోడ్డుకు రూ.45లక్షలతో చేపట్టిన పనులకు సర్పంచ్ జగన్నాథం శంకుస్థాపన చేశారు.

శెట్టిబలిజ సామాజికవర్గంలో పుట్టినందునే రామచంద్రపురం అసెంబ్లీ సీటు దక్కింది



మంత్రి సుభాష్‌ను సత్కరిస్తున్న శెట్టిబలిజవర్గీయులు

రామచంద్రపురం(ద్రాక్షారామ), సెప్టెంబరు 13: శెట్టిబలిజ సామాజిక వర్గంలో పుట్టినందునే రామచంద్రపురం నుంచి తనకు అసెంబ్లీ టిక్కెట్ దక్కిందని, మంత్రివర్గంలో చోటు దక్కిందని మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. శుక్రవారం రామచంద్రపురం లయన్స్ కల్యాణ మండపంలో శుక్రవారం జరిగిన టీడీపీ, జనసేన, బీజేపీ శెట్టిబలిజ సామాజికవర్గ ఆత్మీయసమావేశంలో మంత్రి మాట్లాడారు. శెట్టిబలిజ సామాజిక వర్గీయుడిగా అసెంబ్లీ టిక్కెట్ దక్కితే తన గెలుపులో కీలక పాత్ర కాపు కులస్థులు పోషించారన్నారు. అలాగే చేనేత కార్మికులు, మాదిగ, ఇతర బీసీ సామాజిక వర్గీయులు గెలుపునకు కృషి చేశారన్నారు. శెట్టిబలిజ సామాజికవర్గంలో అధికంగా తనతో కలిసి వచ్చినందు వల్లే మంచి మెజార్టీతో విజయం సాధించానన్నారు. శెట్టిబలిజ రామచంద్రపురం కల్యాణ మండపం పరిస్థితి బాగా లేదని, అమలాపురంలో కూడా సరైన కల్యాణ మండపం లేని పరిస్థితి ఉందన్నారు. త్వరలో రానున్న మద్యం షాపుల్లో 20శాతం గీత కులాలకు కేటాయించేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. శెట్టిబలిజ కార్పొరేషన్ ద్వారా రుణాలు రానున్నాయన్నారు. శెట్టిబలిజ సంఘీయుల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. మంత్రి సుభాష్‌ను శెట్టిబలిజ సంఘీయులు సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ శెట్టిబలిజ సంఘ నాయకులు, మంత్రి సుభాష్ తండ్రి వాసంశెట్టి సత్యం, మాజీ సర్పంచ్ టేకుమూడి సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ విత్తనాల వెంకట రమణ, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కట్టా నాగేశ్వరరావు, మాజీ కౌన్సిలరు దంగేటి గౌరీశంకర్, దొంగల శ్రీధర్, కుడుపూడి పణితేజ, మేడిశెట్టి బాస్కరారావు, వసుంరాజు, బీజేపీ నాయకులు యాండ్రబుల్లబ్బులు, ఇళ్ల వెంకటేశ్వరరావు, కూటమి శెట్టిబలిజ సంఘీయులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ కౌన్సిలర్



ఎమ్మెల్యేలు వేగుళ్ల, నల్లమిల్లి సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ కౌన్సిలర్ గ్రంధి శ్రీనివాస్

మండపేట, సెప్టెంబరు13: స్థానిక 15వ వార్డు వైసీపీ కౌన్సిలర్ టీడీపీలో చేరారు.స్థానిక టీడీపీ కార్యాలయంలో మండపేట, అనపర్తి ఎమ్మెల్యేలు వేగుళ్ల జోగేశ్వరరావు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సమక్షంలో 15వార్డు కౌన్సిలర్ గ్రంధి శ్రీనివాస్ శుక్రవారం టీడీపీలో చేరారు. శ్రీనివాస్‌తో పాటు అతడి అనుచరులను పార్టీలోకి ఎమ్మెల్యేలు ఆహ్వానించారు. ఇప్పటికే నలుగురు వైసీపీ కౌన్సిలర్లు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు చిట్టూరి సతీష్, మలసాని సీతారత్నం, యరమాటి గంగరాజు, కొవ్వాడ జేబి, పిల్లి గణేశ్వరరావు, కాళ్లకూరి స్వరాజ్యభవాని, టీడీపీ జనసేన, బీజేపీ, నేతలు నల్లమిల్లి వీర్రెడ్డి, ఉంగరాల రాంబాబు, నామాల చంద్రరావు, గొడవర్తి రామచంద్రరావు, శెట్టిరవి, గుండు తాతరాజు పాల్గొన్నారు.

దశలవారీగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం

మలికిపురం, సెప్టెంబరు 13: రాజ్యాంగాన్ని విస్మరించి ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుకు నిరసనగా దశలవారీగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని రాజోలు, మామిడికుదురు, మలికిపురం, సఖినేటిపల్లి మండలాల జేఏసీ నాయకులు తీర్మానించారు. శుక్రవారం మలికిపురం పూలే-అంబేడ్కర్ సామాజిక భవనంలో మాలల న్యాయపోరాట సమితి, ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకుల సమావేశం గెడ్డం ఫిలిప్‌రాజు అధ్యక్షతన జరిగింది. మాజీ ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు మాట్లాడుతూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును పార్టీలకు అతీతంగా అందరూ వ్యతిరేకించాలన్నారు. సమావేశంలో బత్తుల మురళీకృష్ణ, చింతా రాజబాబు, నల్లి శ్రీనివాస్, బొంతు మణిరాజు, విప్పర్తి సాయిబాబు, తోటే ప్రతాప్ పాల్గొన్నారు.

వినాయకుడికి గరిక పూజ

ఆలమూరు, సెప్టెంబరు13: పెదపళ్లలో గణపతి నవరాత్రి ఉత్సవాల్లోభాగంగా శుక్రవారం స్వామివారికి గరిక పూజ నిర్వహించారు. ఆలమూరులోలక్ష్మీగణపతి స్వామి కినాణేలతో చేయించిన మాలను అలంకరించారు.

స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యం



ముంగండ తాగునీటి ప్రాజెక్టు వద్ద ఫిల్టర్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, నామన రాంబాబు

పి.గన్నవరం, సెప్టెంబరు 13: గ్రామీణ ప్రాంతాల్లో స్వచ్ఛమైన తాగునీరు అందించడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. ముంగండ తాగునీటి ప్రాజెక్టులో రూ.25లక్షలతో ఏర్పాటుచేసే 2ఎంఎల్‌డీ మైక్రో ఫిల్టర్ ఏర్పాటుకు టీడీపీ కోఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ నామన రాంబాబు, కూటమి నేతలతో కలిసి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. పూర్తిస్థాయిలో అన్ని గ్రామాలకు తాగునీరు అందించాలంటే 21లక్షల లీటర్ల తాగునీరు అవసరమని ఎమ్మెల్యే అన్నారు. దీనికిగాను అదనపు మైక్రోఫిల్టర్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ ఏఎన్‌వీ పద్మనాభం, జేఈ కళ్యాణ చక్రవర్తి, శిరిగినీడి వెంకటేశ్వరరావు, మట్టపర్తి రామకృష్ణ, వాసంశెట్టి కుమార్, సర్పంచ్‌లు కుసుమ చంద్రకళ, బొండాడ నాగమణి, యల్లమిల్లి కృష్ణవేణి, వడలి కొండయ్య, పప్పుల సాయిబాబు, యర్రాప్రగడ గోపి, అంబటి భూలక్ష్మి, పెచ్చెట్టి వెర్రియ్య, యర్రంశెట్టి సాయిబాబు, నక్కా సత్యనారాయణ, ఆరుమిల్లి లాల్‌బాబు, శేరు శ్రీనుబాబు, తాటికాయల శ్రీను, పితాని రాంబాబు, కె.సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

వరద ముంపు బాధితులకు అండగా ఉంటాం: మంత్రి

కె.గంగవరం, సెప్టెంబరు 13: వరద ముంపు బారిన పడిన ప్రతీ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. శుక్రవారం కోటిపల్లిలో వరద ఉధృతిని ఆయన పరిశీలించారు. ముంపు బారిన పడిన మాధవనగర్‌లోని మత్స్యకార కాలనీలోని ఇళ్లను పరిశీలించారు. అండగా ఉంటామని బాధిత కుటుంబాలకు భరోసా ఇచ్చారు. నష్టాలు అంచనాలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పపుల మసేను వెంకన్న(రేవు శ్రీను), తోట వెంకన్న, గొడవర్తి రామకృష్ణ, చీకట్ల సోమేశ్, మతుకమిల్లి సుబ్రహ్మణ్యం, సుంకర సాయి, స్థానిక అధికారులు పాల్గొన్నారు.



కోటిపల్లిలో వదర ఉధృతిని పరిశీలిస్తున్న మంత్రి సుభాష్

మండల స్థాయి అధికారులు డుమ్మా కొట్టడంపై ప్రజాప్రతినిధులు ఆగ్రహం

ఆత్రేయపురం, సెప్టెంబరు13: మండల పరిషత్ సమావేశాలకు అధికారులు తరుచుగా డుమ్మా కొట్టడంపై ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆత్రేయపురం మండల పరిషత్ సమావేశం ఎంపీపీ కుండా అన్నపూర్ణ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ప్రజాప్రతినిధులు పలు సమస్యలపై ఏకరువు పెట్టారు. సమావేశాలకు అధికారులు గైర్హాజరు కావడంపై జడ్పీటీసీ బోనం సాయిబాబా ఆగ్రహం వ్యక్తం చేశారు. పేరవరం జడ్పీ హైస్కూల్ హెచ్ఎం తరుచూ విధులకు గైర్హాజరు కావడంతో అభివృద్ధి పనులు కుంటుపడుతున్నాయని సర్పంచ్ గంటి విజయభారతి మండిపడ్డారు. రావులపాలెం-రాజమహేంద్రవరం మధ్య ఆర్టీసీబస్సులు రద్దు చేయడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారని ఎంపీటీసీ వేముల వెంకన్న పేర్కొన్నారు. ర్యాలి పీహెచ్‌సీ భవనానికి ప్రహరీ నిర్మించకపోవడంతో అసాంఘిక కార్యకలపాలకు అడ్డాగా మారిందని జడ్పీటీసీ సాయిబాబా అన్నారు. తమ గ్రామంలో ఇంటింటికీ తాగునీరు పూర్తిస్థాయిలో అందట్లేదని సర్పంచ్ మెర్ల రాము పేర్కొన్నారు. డ్రైనేజీలపై నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను తొలగించాలని కోరారు. వివిధ సమస్యలను సభ్యులు ఏకరువు పెట్టారు. వివిధశాఖల అధికారులు తాము చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజాప్రతినిధులకు వివరించారు. ఎంపీడీవో నాతి బుజ్జి, తహసీల్దారు రాజేశ్వరరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

ఏచూరి సీతారామ్ మృతి తీరని లోటు

మామిడికుదురు, సెప్టెంబరు 13: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారామ్ ఏచూరి మరణం తీరని లోటని అంబేడ్కర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చిట్టిబాబు అన్నారు. అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం అలుపెరగని పోరాటం చేసిన యోధుడని కొనియాడారు.

వరద బాధితులను ఆదుకుంటాం



బోడసకుర్రులో వరద బాధితులకు ఆహార పొట్లాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

అల్లవరం, సెప్టెంబరు 13: వైనతేయ వరద బాధితులను ప్రభుత్వపరంగా ఆదుకుంటామని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. బోడసకుర్రు పల్లిపాలెంలో వైనతేయ వరద ముంపు బాధితులకు శుక్రవారం ఆయన ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దారు వీవీఎల్ నరసింహరావు, ఎంపీడీవో కృష్ణమోహన్, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబురాజు, సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి, చింతా శ్రీనివాస్, అడపా శ్రీనివాసరావు, బొర్రా ఈశ్వరరావు, ముత్యాల బాబీ, అల్లాడ స్వామినాయుడు, మొయిల గణపతి, రొక్కాల నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి సింగంపల్లి దుర్గాశ్రీనివాస్ పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

అమలాపురంటౌన్, సెప్టెంబరు13: జిల్లా ఉత్తమఉపాధ్యాయ అవార్డులు అందుకున్న మున్సిపల్ టీచర్లను ఎస్టీయూ పట్టణశాఖ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కొంకాపల్లి మున్సిపల్ హైస్కూలు హెచ్ఎం కాశి గణసత్యనారాయణ, అదే పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు వీవీఎల్ఎన్ శ్రీరామ్, మహాత్మాగాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయిని మోరం సీతామహలక్ష్మి సేవలను ప్రశంసిస్తూ ఎస్టీయూ పట్టణ శాఖ అధ్యక్షుడు నక్కా బాలకృష్ణ, మహిళా అధ్యక్షురాలు ఆర్.దుర్గ ఆధ్వర్యంలో సత్కరించారు. బొరుసు రమాకాంత్, పి.రవికుమార్, బందా ఆర్.కామేశ్వరరావు, ఎంఎస్ఎన్ మూర్తి, కేఎస్ఎన్ మూర్తి, ఎస్టీ మంజూష, బీవీ పోలిశెట్టి పాల్గొన్నారు.

5కే రన్‌లో పల్లవికి ద్వితీయ బహుమతి

కొత్తపేట, సెప్టెంబరు 13: అమలాపురం ఏరియా ఆసుపత్రి, ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ నిర్వహించిన 5కే రన్‌లో కొత్తపేట విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాల బీకాం ద్వితీయ సంవత్సరం విద్యార్థిని వై.పల్లవి ద్వితీయ బహుమతి గెలుచుకుంది. ఆమెకు అదనపు డీఎంహెచ్‌వో డాక్టర్ సీహెచ్ భరతలక్ష్మి రూ.4వేల నగదు బహుమతి, ప్రశంసాపత్రం అందజేశారు. పల్లవిని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పెద్దిరాజు, వైస్ ప్రిన్సిపాల్ టి.రమాదేవి, అధ్యాపకులు కె.సత్యనారాయణ, సీహెచ్ నాగశ్రీలక్ష్మి, సత్య అభినందించారు.

రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ కార్యవర్గ ప్రమాణస్వీకారం

ఆలమూరు, సెప్టెంబరు 13: కొత్తపేట నియోజకవర్గ రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారోత్సవం ఆలమూరులో శుక్రవారం ఘనంగా జరిగింది. అధ్యక్షుడిగా వంటిపల్లి పాపారావు, కార్యదర్శిగా సత్తి భామిరెడ్డి, కోశాధికారిగా వెత్సా సూర్యకోటిప్రకాశరావు, ఉపాధ్యక్షులుగా రాయుడు సుభాకర్, సయ్యపురాజు బంగార్రాజు, సంయుక్త కార్యదర్శిగా ఉండమట్ల పరమేష్ బాధ్యతలు స్వీకరించారు.

వివేకానంద పాఠశాలలో హిందీ దివస్

మలికిపురం, సెప్టెంబరు 13: జాతీయ హిందీ దినోత్సవం సందర్భంగా వివేకానంద పాఠశాల విద్యార్థులు హిందీ అక్షరాల్లో ఒదిగారు. విద్యార్థులకు హిందీ ప్రాధాన్యతను పలువురు వక్తలు, ఉపాధ్యాయులు వివరించారు.

ఇసుకపూడి సర్పంచ్ చెక్‌పవర్ రద్దు

అంబాజీపేట, సెప్టెంబరు 13: ఇసుకపూడి సర్పంచ్ తరపట్ల మోహన్‌సింగ్‌బాబూరావు చెక్‌పవర్ రద్దు చేస్తూ జిల్లా పంచాయతీ అధికారి డి.రాంబాబు ఉత్తర్వులు జారీ చేశారు. 2013 నుంచి 2023 వరకు పంచాయతీ ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శుల హయాంలో సర్పంచ్ మోహన్‌సింగ్ నిధులు దుర్వినియోగానికి పాల్పడ్డారని స్థానిక ఎంపీటీసీ ముత్తాబత్తుల ప్రశాంత్, వార్డు సభ్యుడు పళ్ళ శ్రీనివాస్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈవిషయంపై సమాధానం ఇవ్వాలని సర్పంచ్‌కు డీపీవో షోకాజ్ నోటీసు అందించారు. దీనిపై సర్పంచ్ స్పందించక పోవడంతో మూడు నెలల పాటు చెక్‌పవర్ రద్దు చేస్తూ ఆగస్టు18న డీపీవో ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఈఉత్తర్వులను ఈనెల9న ఈవోపీఆర్డీ మమత ద్వారా సర్పంచ్‌కు అందించారు. నెల రోజుల తరువాత ఉత్తర్వులు సర్పంచ్‌కు అందించడంతో అధికారుల తీరును గ్రామస్థులు విమర్శిస్తున్నారు.

ముమ్మిడివరంలో జాబ్‌మేళా

ముమ్మిడివరం, సెప్టెంబరు13: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ముమ్మిడివరం ఎయిమ్స్ కళాశాలలోని ఉపాధి కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహించారు. 187మంది నిరుద్యోగ యువతీ యువకులు హాజరుకాగా మూడు కంపెనీలకు సంబంధించి 87మంది ఉద్యోగ అర్హతలు సాధించారు. మరో 23మంది రెండో రౌండ్‌కు వేచి ఉన్నారు. జిల్లాఉపాధి అధికారిణి వసంతలక్ష్మి, జిల్లా స్కిల్ డెవలెప్‌మెంట్ అధికారి పి.లోకమాన్, కళాశాల ప్రిన్సిపాల్ ఆనంద్‌బాబు, ఒ.నాగబాబు, జిల్లా ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కె.రాజేంద్రప్రసాద్, స్కిల్‌హబ్ కోఆర్డినేటర్ శ్రీదేవి, కంపెనీ హెచ్‌ఆర్‌లు, ఏపీఎస్ఎస్‌డీసీ సిబ్బంది పాల్గొన్నారు.

'స్వచ్ఛత హి సేవ'ను విజయవంతం చేయాలి

అల్లవరం, సెప్టెంబరు 13: 'స్వచ్ఛత హి సేవ'ను విజయవంతం చేయాలని ఎంపీడీవో కృష్ణమోహన్ కోరారు. శుక్రవారం ఆయన మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు అవగాహన సదస్సు నిర్వహించారు. స్వచ్ఛత భాగ్‌దారి, సంపూర్ణ స్వచ్ఛత, సఫాయిమిత్ర సురక్షలను అన్ని గ్రామాల్లో ఈనెల17 నుంచి అక్టోబరు 2వరకు అమలు జరపాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు ఎస్.రాజమోహన్, కంకిపాటి సత్యనారాయణ, చిక్కం శ్రీనివాస్, శంకరప్రసాద్, శిరీష, మల్లాయమ్మ, జ్యోతి పాల్గొన్నారు.

స్వాగత ద్వారాల ఏర్పాటుకు ప్రతిపాదనలు

ఆత్రేయపురం, సెప్టెంబరు 13: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయానికి వచ్చే భక్తులకు స్వాగత ద్వారాలు (ఆర్చ్ గేట్లు) నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందిస్తున్నట్టు ఉప కమిషనరు భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు. బొబ్బర్లంక, వాడపల్లి కొత్త వంతెన, రావులపాలెం కళా వెంకట్రావు విగ్రహం వద్ద మూడు ఆర్చ్ గేట్ల ఏర్పాటుకు చేపట్టామన్నారు. శుక్రవారం ఆర్అండ్‌బీ డీఈ జి.రాజేంద్ర రోడ్ల ముఖద్వారాలను పరిశీలించారు. ఆయన వెంట ఏఈ మణికుమార్, సూపరింటెండెంట్ శ్రీనివాస్ వున్నారు.

ఆర్థిక సాయం

రావులపాలెం, సెప్టెంబరు13: రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ రెండో సంవత్సరం చదువుతున్న మానేపల్లి కార్తీక్ రెండు కిడ్నీలు పాడై అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు రూ.28 వేలు సాయం అందించినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శ్రీనివాసరావు తెలిపారు.

బాలిక కిడ్నాప్ కేసులో వ్యక్తి అరెస్టు

ద్రాక్షారామ, సెప్టెంబరు 13: బాలికను కిడ్నాప్ చేసిన కేసులో చోడవరానికి చెందిన ఉర్లగుంట వీరబాబును శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. రామచంద్రపురం మేజిస్ట్రేట్ కోర్టులో అతడ్ని హాజరుపర్చగా రిమాండు విధించినట్టు సీఐ కె.అశోక్ కుమార్ తెలిపారు.

లక్ష దూర్వార్చన, లక్ష్మీగణపతి హోమం



గొల్లవిల్లి వినాయక ఆలయం వద్ద లక్ష్మీగణపతి హోమం, లక్ష బిల్వార్చన నిర్వహిస్తున్న దృశ్యం

ఉప్పలగుప్తం, సెప్టెంబరు 13: గొల్లవిల్లిలో సిద్ధివినాయక 35వ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం లక్ష దూర్వార్చన, లక్ష్మీగణపతి హోమం, సప్తనదీ జలాల అభిషేకం నిర్వహించారు. మాగాపు నాగేంద్రవరప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో పలువురు రుత్వికులు పూజలు జరిపారు. పెద్దిరెడ్డి రామ్మోహన్-ఉమామహేశ్వరి దంపతుల సహకారంతో స్వామిని వివిధ ఫలాలతో అలంకరించారు. గ్రామ యువత సహకారంతో అన్నసమారాధన జరిగింది. పలువురు రాజకీయ ప్రముఖులు పూజల్లో పాల్గొన్నారు.

సౌత్‌జోన్ పోటీలకు కుందూరు పాఠశాల విద్యార్థి ఎంపిక

కె.గంగవరం, సెప్టెంబరు 13: రాష్ట్ర స్థాయి సౌత్‌జోన్ అథ్లెటిక్ పోటీలకు కుందూరు ఉన్నత పాఠశాల విద్యార్థి ఎంపికైనట్టు పాఠశాల హెచ్ఎం చింతలపూడి ఆదినారాయణమూర్తి చెప్పారు. గురువారం రావులపాలెంలో జరిగిన జిల్లాస్థాయి పోటీలు అండర్-14 ట్రైఅథ్లెన్ విభాగంలో గుబ్బల కుందన లక్ష్మీప్రియ హైజంప్ ప్రథమ, లాంగ్‌జంప్, 60మీటర్ల రన్నింగ్‌లో ప్రథమ స్థానం సాధించింది. అక్టోబరు 4,5,6తేదీల్లో గుంటూరు ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరిగే సౌత్‌జోన్ పోటీలకు అర్హత సాధించిందని చెప్పారు.

అథ్లెటిక్స్ పోటీలకు భీమనపల్లి విద్యార్థినుల ఎంపిక

ఉప్పలగుప్తం, సెప్టెంబరు 13: భీమనపల్లి శ్రీమతి శిరంగు రంగనాయకమ్మ జడ్పీ హైస్కూలు విద్యార్థినులు గుంటూరులో జరిగే సౌత్‌జోన్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్టు పాఠశాల ఇన్‌చార్జి అరవ నాయుడు తెలిపారు. అండర్-16 విభాగంలో బడుగు అక్షిత, అండర్-14 విభాగంలో సీహెచ్ జోషితవర్ధిని ఎంపికయ్యారు. వీరిని పీఎంసీ చైర్మన్ గుర్లింక చిన్నా, పీడీ కామన మధుసూదనరావు, ఉపాధ్యాయులు రాయి వెంకటేశ్వరరావు, నడింపల్లి పద్మనాభన్ అభినందించారు.

పాఠశాలలకు వాటర్ ఫిల్టర్లు బహూకరణ

ముమ్మిడివరం, సెప్టెంబరు 13: అనాతవరంలోని మహిపాలచెరువు, మునుకోటివారిపాలెం, అనాతవరం బ్రాహ్మణవీధి మెయిన్, అజ్జరపువారిపేట, మట్టపర్తివారిపాలెం, టి.సావరంలోని ఎంపీపీ పాఠశాలలకు శుక్రవారం గ్రామ సర్పంచ్ మిమ్మితి చిరంజీవి వాటరు ఫిల్టర్లను బహూకరించారు. ఆయా కార్యక్రమాల్లో ఉప సర్పంచ్ పేరిచర్ల సురేష్‌రాజు, కురసాల శివబాబు, కర్రి నాగమల్లేశ్వరి, మోరం భవానీ, సలాది అర్జునరావు, పాటి సత్యవతి, లంక లీలావతి, చాట్ల బాలయోగి, పెట్టా శ్రీలక్ష్మి, కుడుపూడి శ్రీనివాసరావు, బుడితి సత్యవేణి, పెయ్యల వరప్రసాద్, మట్టపర్తి శ్రీరామచంద్రమూర్తి, వనచర్ల పార్వతి, యిళ్ల హేమలత, మునికోటి ఏసుబాబునాయుడు, అందే శ్రీను, మునుకోటి జాజి, ఎస్ఎంసీ చైర్మన్లు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మూడో రోజుకు అధ్యాపకుల సమ్మె

మలికిపురం, సెప్టెంబరు 13: వేతనాలు చెల్లించాలంటూ మలికిపురం ఏఎఫ్‌డీటీ ట్రస్టు పరిధిలోని ఏంవీఎన్‌జేఎస్ అండ్ ఆర్వీఆర్ డిగ్రీ కళాశాల అధ్యాపకులు చేస్తున్న సమ్మె శుక్రవారం నాల్గో రోజుకు చేరింది. వీరికి విద్యార్థులు, ప్రజా సంఘాల నాయకులు మద్దతు పలికారు.

దుమ్ము సమస్య తీర్చాలంటూ వ్యాపారస్తుల ధర్నా

మామిడికుదురు, సెప్టెంబరు13: జాతీయ రహదారిపై ఏర్పడుతున్న దుమ్ము సమస్యను తీర్చాలంటూ పాశర్లపూడి కొండాలమ్మచింతలోని వ్యాపారులు శుక్రవారం జాతీయ రహదారిపై ధర్నా చేశారు.రోడ్డును ప్రతీరోజు తడిపి సమస్యను పరిష్కరించాలంటూ డిమాండు చేశారు. వ్యాపారస్తులు పాల్గొన్నారు.

వంట గదిలో త్రాచుపాము

ఐ.పోలవరం, సెప్టెంబరు 13: మురమళ్ళలో గోకవరపు మణికంఠ ఇంటి వంటగదిలో శుక్రవారం త్రాచుపాము హల్‌చల్ చేసింది. స్నేక్ క్యాచర్ జంపన గణేష్‌వర్మ పామును పట్టుకుని సురక్షిత ప్రదేశంలో విడిచిపెట్టారు.

మొక్కుబడిగా ఆసుపత్రి కమిటీ సమావేశం

అంబాజీపేట, సెప్టెంబరు13: ముక్కామల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆసుపత్రి కమిటీ సమావేశం మొక్కుబడిగా ముగిసింది. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, సర్పంచ్ వాసంశెట్టి రేవతి, వైద్యాధికారి ఇంద్రావతి మాత్రమే సమావేశానికి హాజరయ్యారు. వక్కలంక సర్పంచ్ భర్తకు ప్రజాప్రతినిధుల స్థానంలో సీటు కేటాయించడంపై పలువురు వైద్యాధికారి తీరుపై మండిపడుతున్నారు.

పాఠశాలలో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

అంబాజీపేట, సెప్టెంబరు13: అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సమగ్ర శిక్ష అకడమిక్ మోనటరింగ్ అధికారి పి.రాంబాబు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. సైన్సుల్యాబ్ పనులకు రూ.15.58లక్షలు మంజూరు ఇప్పటివరకు రూ.12లక్షలు నిధులు విడుదలయ్యాయి. ల్యాబ్‌నిర్మాణ పనులు 80శాతం వరకు పూర్తి అయినట్లు తెలిపారు. ఆట స్థలం అభివృద్ధికి రూ.5లక్షలు మంజూరయ్యాయన్నారు. జిల్లా సైన్సు అధికారి జీవీవీ సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు వెన్నపు సత్యనారాయణ, బొక్కా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నిలకడగా వరద ప్రవాహం

యానాం, సెప్టెంబరు 13: యానాం యానాం జీఎంసీ బాలయోగి వారధి వద్ద వరద నిలకడగా కొనసాగుతోంది. ధవళేశ్వరం నుంచి వరద నీరు ప్రతిరోజు సముద్రంలోకి వదలడంతో యానాం గౌతమి గోదావరి నుంచి సముద్రంలోకి చేరుతుంది. యానాం రాజీవ్‌గాంధీ బీచ్‌లోని పలు పర్యాటక కట్టడాలు, పర్యాటక కేంద్రాలు వరద ముంపునకు గురయ్యాయి. పరిపాలనాధికారి మునిస్వామి వరద పరిస్థితిపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి ముంపు ప్రాంతాలను పరిశీలించారు. భద్రాచలంలో వరద తగ్గుముఖం పట్టినప్పటికి యానాంలో వరద తగ్గడానికి మూడు రోజులు పడుతుంది.

ఘనంగా గణపతి హోమం

యానాం, సెప్టెంబరు 13: స్థానిక పిల్లారాయ వీధిలో కొలువైన శ్రీపిళ్లైయ్యార్‌స్వామి (లక్ష్మిగణపతి) నవరాత్రి బ్రహ్మోత్సవాలలో బాగంగా శుక్రవారం ఆలయంలో గణపతి హోమం ఘనంగా నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించి ఆలయ ప్రాగంణంలో హోమం నిర్వహించారు. సాయంత్రం శెట్టిబలిజ సేవా సంఘం ఉత్సవదారులుగా ఉన్న సింహ వాహనంపై స్వామి విహరించారు. ముందుగా ఆలయంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం వాహనంపై ఉత్సవ విగ్రహాలను ఆశీనులు గావించి పూజలు నిర్వహించారు.

మద్యం సేవించి బైక్ నడిపిన వ్యక్తికి 15రోజులు జైలు

మండపేట, సెప్టెంబరు 13: మద్యం సేవించి మోటార్‌సైకిల్ నడుపుతున్న పాలతోడుకు చెందిన యువకుడు కట్టా శ్రీనును రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. ఆలమూరు కోర్టు అతడికి 15రోజులు జైలు శిక్ష విధించిందన్నారు.

సీతారాం ఏచూరి మృతికి సంతాపం

కొత్తపేట, సెప్టెంబరు 13: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతికి పలివెలకు చెందిన అల్లూరి సీతారామరాజు జాతీయ సంస్థ సభ్యుడు దుళ్ల వెంకటేశ్వర్లు సంతాపం తెలిపారు.